# అక్టోబర్ - 2011

## యశ్‌పాల్‌కు శాస్త్రి అవార్డు

ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ యశ్‌పాల్‌కు 2011 లాల్‌బహదూర్ శాస్త్రి అవార్డును అక్టోబర్ 15న న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ బహూకరించారు. ప్రభుత్వ పాలన, విద్య, మేనేజ్‌మెంట్ రంగాల్లో అందించిన విశిష్ట సేవలకుగాను ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. భారత రెండో ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి జ్ఞాపకార్థం 'లాల్‌బహదూర్ శాస్త్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్' ఈ అవార్డును నెలకొల్పింది. ఈ పురస్కారం కింద ఐదు లక్షల నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు.

## ఏపీ ట్రాన్స్‌కోకు ఎనర్టీయా అవార్డు

ఏపీ ట్రాన్స్‌కో (ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్)కు 2011 సంవత్సరంలో అత్యుత్తమ పనితీరు కేటగిరీలో 'ఎనర్టీయా' జాతీయ పురస్కారం లభించింది. సరఫరా, పంపిణీ నష్టాలను తగ్గించి వినియోగదారులకు మెరుగైన సేవలను అందించినందుకుగానూ ట్రాన్స్‌కోకు ఈ అవార్డు దక్కింది. 2009-10లో 18.34 శాతంగా ఉన్న విద్యుత్ నష్టాలను ట్రాన్స్‌కో 2010-11లో 17. 76 శాతానికి తగ్గించింది. ఏటా వివిధ రంగాల్లో మంచి పనితీరు కనబర్చిన విద్యుత్ సంస్థలకు 'ఎనర్టీయా' అనే స్వచ్ఛంద సంస్థ ఈ అవార్డులను అందిస్తోంది.

## మోహన్ ధారియాకు ఇందిరా పురస్కారం

కేంద్ర మాజీ మంత్రి, పర్యావరణ ప్రేమికుడు మోహన్ ధారియా 26వ ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా పురస్కారానికి ఎంపికయ్యాడు. దేశంలో జాతీయ సమైక్యతా స్ఫూర్తిని పరిరక్షించేందుకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఈ అవార్డు దక్కింది. పురస్కారం కింద ఐదు లక్షల రూపాయల నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు.

## రసాయన శాస్త్రం:

ఇజ్రాయెల్ శాస్త్రవేత్త డేనియల్ షెట్‌మన్‌కు రసాయన శాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి లభించింది. ఆయన కనిపెట్టిన క్వాజీ క్రిస్టల్స్‌కు ఈ అవార్డు దక్కింది. క్వాజీక్రిస్టల్స్ అంటే ఒక రకమైన స్ఫటికం. సాధారణ స్ఫటికాల్లో నిర్దిష్ట నిర్మాణం పదే పదే పునరావృతమవుతూ ఉంటుంది. క్వాజీ క్రిస్టల్స్‌లో మాత్రం అలా ఉండదు. 1982లో షెట్‌మన్ అల్యూమినియం, మాంగనీస్‌లలో ప్రయోగాలు చేస్తున్నప్పుడు తొలిసారి ఈ క్రిస్టల్స్‌ను గుర్తించాడు.

**ఫిజిక్స్:** విశ్వం వ్యాకోచిస్తోందని తమ పరిశోధనల్లో గుర్తించిన శాస్త్రవేత్తలు.. సాల్ పెర్ల్‌మట్టర్(అమెరికా), బ్రెయిన్ స్కిమిట్(ఆస్ట్రేలియా), ఆడమ్ రీస్(అమెరికా)లకు ఉమ్మడిగా ఈ ఏడాదికిగాను భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. కొంత మంది శాస్త్రవేత్తలు భావిస్తున్నట్లుగా విశ్వం వ్యాకోచించడం నెమ్మదించలేదనీ చాలా వేగంగా సాగుతోందని పెర్ల్‌మట్టర్, స్కిమిట్, రీస్‌లు 1990లలో చేపట్టిన తమ పరిశోధనల్లో గర్తించారు. అవార్డు కింద దక్కే నగదులో 50 శాతం (కోటి క్రోనార్లు లేదా ' 7.5 కోట్లు) పెర్ల్‌మట్టర్‌కు దక్కుతుంది. మిగిలిన మొత్తాన్ని స్కిమిట్, రీస్‌లు చెరిసగం పంచుకుంటారు.

**సాహిత్యం:** స్వీడిష్ కవి, రచయిత టోమాస్ ట్రాన్స్‌ట్రోమర్‌కు సాహిత్యంలో ఈ ఏడాదిలో నోబెల్ బహుమతి లభించింది. మానవ మేధ రహస్యాల గురించి ట్రోమర్ వినూత్న శైలిలో రాసిన అధివాస్తవిక(సర్రియలిస్టు) కవిత్వం, ఇతర రచలు ఆయనకు పేరు తెచ్చాయి. 'హాఫ్ ఫినిష్డ్ హెవెన్', 'విండోస్ అండ్ స్టోన్స్', 'ద గ్రేట్ ఎనిగ్మా' వంటివి ఆయన ప్రముఖ రచనలు. గాఢ, నిగూఢ ప్రతీకలతో వాస్తవం గురించి తెలుసుకోవడానికి కొత్త మార్గం చూపినందుకు ఆయనకు నోబెల్ బహుమతి ఇస్తున్నట్లు స్వీడిష్ అకాడమీ పేర్కొంది.

**ఆర్థిక శాస్త్రం:** అమెరికాకు చెందిన ఆర్థిక శాస్త్రవేత్తలు థామస్ సార్జెంట్, క్రిస్టోఫర్ సిమ్స్‌కు ఈ ఏడాది ఆర్థిక రంగంలో నోబెల్ పురస్కారం లభించింది. ప్రభుత్వ ఆర్థిక విధానాల రూపకల్పన, స్థూల ఆర్థిక శాస్త్రాల్లో చేసిన పరిశోధనలకు గుర్తింపుగా వీరికి ఈ గౌరవం దక్కింది. సార్జెంట్ న్యూయార్క్ వర్సిటీలో ఎకానమిక్స్ అండ్ బిజినెస్ ప్రొఫెసర్‌గా పని చేస్తుండగా, సిమ్స్ ప్రిన్స్‌టన్ వర్సిటీలో ఎకానమిక్స్ అండ్ బ్యాంకింగ్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

**శాంతి:** శాంతిని విశ్వవ్యాప్తం చేయడంలో మహిళలు పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ ఏడాది ముగ్గురు ఉద్యమకారిణులకు ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి అందించనున్నారు. వివరాలు..

- **తవక్కుల్ కర్మాన్(యెమెన్‌కు చెందిన జర్నలిస్ట్):** ఈ అవార్డును అందుకుంటున్న తొలి అరబ్ మహిళ. యెమెన్‌లో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు తవక్కుల్.
- **ఎలెన్ జాన్సన్ సర్లీఫ్(లైబీరియా అధ్యక్షురాలు):** ఆఫ్రికా ఖండంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన తొలి మహిళా అధ్యక్షురాలు. ఆర్థికవేత్త అయిన సర్లీఫ్ సంస్కరణలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు.
- **లేమా బ్యూవీ(లైబీరియాకు చెందిన శాంతి కార్యకర్త):** దేశంలో శాంతిని నెలకొల్పేందుకు, యుద్ధ పరిస్థితులను అంతమొందించేందుకు, జాతి, మతాలకు సంబంధం లేకుండా మహిళలను సమాయత్తం చేసి.. వారు ఎన్నికల్లో పాల్గొనేందుకు తోడ్పడ్డారు.

## దలైలామాకు గాంధీ శాంతి బహుమతి

టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాకు మహాత్మా గాంధీ శాంతి బహుమతి దక్కింది. డర్బన్(దక్షిణాఫ్రికా)లో వచ్చేవారం జరిగే వార్షిక సత్యాగ్రహ అవార్డుల కార్యక్రమంలో దలైలామా ఈ పురస్కారాన్ని అందుకుంటారు.

## 2011 రైట్ లైవ్లీహుడ్ అవార్డులు

2011 రైట్ లైవ్లీ హుడ్ అవార్డులను ప్రకటించారు. ఈ అవార్డులను నోబెల్ పురస్కారాలకు ప్రత్యామ్నాయంగా

**హవాంగ్ మింగ్(చైనా):** సౌరశక్తికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి వినియోగంలోకి తెచ్చినందుకు.

**జాక్విలైన్ మౌదీనా(చాద్):** చాద్ నియంతృత్వ పాలకుడి బాధితులకు న్యాయం చేసేందుకు నిరంతర పోరాటం చేసినందుకు.

**గ్రైన్:** అంతర్జాతీయ స్వచ్ఛంధ సంస్థ. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రైతుల భూములను విదేశీ ఆర్థిక సంస్థలు భారీ స్థాయిలో కొనుగోలు చేస్తున్న చర్యలను ప్రపంచానికి తెలియజేసి..సంబంధిత వ్యక్తుల హక్కుల కోసం కృషి చేసినందుకు.

**ఇనాయే గాస్కిన్:** అమెరికాకు చెందిన గాస్కిన్‌ను ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యంగల మిడ్‌వైఫ్‌గా పేర్కొంటారు. గాస్కిన్ చూపిన సురక్షిత శిశుజననాల విధానాలు తల్లి, బిడ్డల శారీరక–మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు తోడ్పడతాయి.

## దేవానంద్‌కు కిశోర్ కుమార్ సమ్మాన్

2010–11 సంవత్సరానికి 'కిశోర్ కుమార్ సమ్మాన్'కు బాలీవుడ్ నాటి తరం నటుడు దేవానంద్ ఎంపికయ్యారు. లతామంగేష్కర్ పురస్కారం సంగీత దర్శకుడు రాజేష్ రోషన్‌కు దక్కింది. ఈ రెండు అవార్డులను మధ్యప్రదేశ్ ప్రభుత్వం అందజేస్తుంది.

## రోగ నిరోధక పరిశోధనకు నోబెల్

శరీర రోగ నిరోధక వ్యవస్థ రహస్యాలను కనుక్కున్న ముగ్గురు శాస్త్రవేత్తలు.. బ్రూస్ బ్యూట్లర్(అమెరికా), జూల్స్ హాఫ్‌మన్ (లక్సెంబర్గ్), రాల్ఫ్ స్టైన్‌మాన్(కెనడా)లకు ఈ ఏడాదికి వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. వీరిలో బ్యూట్లర్, హాఫ్‌మాన్‌లు రోగ నిరోధక వ్యవస్థను చైతన్యపరిచే కీలక గ్రాహక ప్రోటీన్లను కనుగొన్నారు. మరో శాస్త్రవేత్త స్టైన్‌మాన్ శరీరంలో ప్రవేశించే హానికర క్రిములను రోగనిరోధక వ్యవస్థ గుర్తించి, నశింప చేసేందుకు తోడ్పడే డెన్‌డ్రిటిక్ కణాలను కనుక్కున్నారు. స్టైన్‌మాన్ గత నెల